అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాచారం, మే16: మండలంలోని చింతపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల స్థాయి నుంచి ఇప్పటి వరకు కొనసాగిన తమ జీవన ప్రయాణం గురించి వేదిక ద్వారా తెలియజేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య, యాదయ్య, మధుమోహన్, రాజు, అంజయ్య, పూర్వ విద్యార్థులు మేకం ఐలేష్, పత్తి రాజు, శ్రీలత, మాధవి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం, మే16 : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబక్షాపల్లికి చెందిన పిరంగి అంతయ్య (55) తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి మాల్ వైపు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న లారీ అంతయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బైక్‌ను ఢీకొట్టిన కారు ఒకరు..

కొత్తూరు 6: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ హైవేపై రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం ఉదయం జరిగింది. కొత్తూరు ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల శివ (43)తన సొంత గ్రామం నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు. రైల్వే బ్రిడ్జి వద్దకు రాగానే నందిగామ నుంచి కొత్తూరు వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఉల్లిగడ్డల శివకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శివ చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు శివ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ

చేవెళ్లటౌన్, మే 16 : చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, మహేశ్, ఎల్లయ్య, రాంప్రసాద్, మహేందర్, నరేందర్ రెడ్డి, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

- వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్
- షాద్‌నగర్ మార్కెట్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల నిరసన



షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్, మే 16 : తెలంగాణ రైతులకు న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తూ కాంగ్రెస్ సర్కారు పని తీరును ఎండగడుతామని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వడ్లకు రూ.500 బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్‌ల ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు రాజులగా బతికితే నేటి కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. అధికారంలోకి రాకముందు రైతులు పండించిన వడ్లకు రూ.500 బోనస్‌ను అదనంగా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను మర్చిపోయారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ తాండ్ర వెంకట్‌రెడ్డి, నాయకులు మన్నె నారాయణ, రాయికల్ వెంకట్‌రెడ్డి, చందునాయక్, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, బీస్వ రామకృష్ణ, శ్రీశైలం, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్‌కుమార్, రేటికల్ నందీశ్వర్, చీపిరి రవియాదవ్, బుగ్గ కృష్ణ, రాఘవేందర్, కాట వీరేశం. శ్రీనివాసులు, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, పలు గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో కురిసిన వాన.. నీటిలో వెళ్తున్న వాహనాలు

షాద్‌నగర్ పట్టణంలో కురుస్తున్న వర్షం

మోస్తరు నుంచి భారీ వర్షం

షాబాద్, మే16 : శంకర్‌పల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఉదయం నుంచి ఎండ తీవ్రతకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వర్షానికి చల్లబడింది. భారీ వర్షానికి మండలంలోని కొత్తపల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. వర్షానికి పంట పొలాల్లో నీరు చేరింది.

షాద్‌నగర్ : కొన్ని రోజులుగా వేసవి ఎండల వేడిమితో ఇబ్బందులు పడ్డ షాద్‌నగర్ వాసులకు గురువారం కురిసిన ఓ మోస్తరు వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. మధ్యాహ్న సమయంలో సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురువడంతో చల్లటి వాతావరణం నెలకొంది. కొద్ది పాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు కాలనీల్లోని ప్రధాన దారుల్లో వర్షపు నీళ్లు నిలిచాయి. ఇదిఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెప్పారు. ముఖ్యంగా మామిడి రైతులు, ఉద్యానవన పంటల రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తమ ధాన్యం తడిచిపోకుండ ఉండేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

యాచారం : వివిధ గ్రామాల్లో సాయంత్రం ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ దంచి కొట్టడం, సాయంత్రం చల్లబడి వాన కురవడంతో ఒక్కసారిగా చల్లబడింది. యాచారం, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, నానక్‌నగర్, తక్కళ్లపల్లి, చింతపట్ల, గున్గల్, నందివనపర్తి తదితర గ్రామాలలో సాయంత్రం పూట చల్లటి వాన కురువడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వర్షానికి ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ లేకపోవడంతో ప్రజలు అంధకారంలో ఉన్నారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మార్కెట్‌లో ధాన్యం ఉండటంతో రైతులు ఆందోళన చెందారు.

యాచారంలో కురుస్తున్న వర్షం

మతి స్థిమితం లేని యువకుడి అదృశ్యం

బికాశ్‌దాసు (ఫైల్)

కొత్తూరు, మే 16: మతి స్థిమితం లేని ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మే 6న జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. కొత్తూరు పట్టణంలో నివసిస్తున్న బెన్నుదాస్ కుమరుడు బికాశ్‌దాసు (22)కు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 6న ఇంట్లో వారు పనికోసం బయటకు వెళ్లారు. దీంతో బికాశ్‌దాసు ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వారి నుంచి ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో బికాశ్‌దాసు తండ్రి బెన్నుదాస్ గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరసింహారావు తెలిపారు.

గండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

కృష్ణ(ఫైల్)

మొయినాబాద్, మే 16 : మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు న్యాలట కృష్ణ(43) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కృష్ణ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశాడని, తెలంగాణ అనంతరం బీఆర్ఎస్ పార్టీ కోసం ఎంతో కృషి చేశాడని పలువురు గుర్తు చేసుకన్నారు. బీఆర్ఎస్ నాయకులు అతని మృతదేహంపై పూలమాలేసి నివాళి అర్పించారు. అతడి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ఎంపీటీసీ రితీష్‌రెడ్డి, నాయకులు రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

- అవగాహన ర్యాలీలో మండల వైద్యాధికారులు
- జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా పలు చోట్ల ర్యాలీలు, అవగాహన

షాద్‌నగర్‌టౌన్ : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

తుర్కయాంజాల్ : అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మే16 : డెంగీ వ్యాది నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ సరిత అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినం సందర్భంగా పట్నం కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ..దోమల నివారణతోనే డెంగీ నివారణ సాధ్యమవుతుందన్నారు. కొబ్బరి బోండాలు, పూల కుండీలు, ఇంటి పాత్రలు, పాత టైర్లలో నీరు నిల్వలేకుండా చూడాలని, నీటి గుంతల్లో కిరోసిన్, బ్లీచింగ్ ఫౌడర్‌ను చల్లాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

తుర్కయాంజాల్ : డెంగీ వ్యాధిని నివారించడానికి ప్రజలు తమ పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ శిరీష అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినం సదర్భంగా డెంగీ నివారణపై మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖాన డాక్టర్ కార్తిక్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. నివాసాల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్, సంధ్య, ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, అమృత, ఫార్మసిస్టు ఉదయ్‌కుమార్, చించోడ్ ప్రాథమిక ఏఎన్ఎంలు ఆశాలు, పీపీ యూనిట్ ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు : డెంగీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డా. హరికిషన్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా కొత్తూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో గురువారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. దోమల ఆవాసం ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎల్ హెచ్‌పీ డాక్టర్లు సరిత, మానస, ఝాన్సీ, ఉదయ్‌కుమార్, రాము సూపర్‌వైజర్లు రవికుమార్, అనసూయ, ఏఎన్ఎంలు సులోచన, లక్ష్మి, సునంద, రేణుక, జ్యోతి, సుజాత, సుమిత్ర, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెడతాయని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఇంట్లో వాడుకునే పాత్రలు, పూలకుండీలను ఖాళీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎస్‌యూహో హేమ్‌లాల్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్‌లు నిర్మల, నరసింహ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

కొత్తూరు: డెంగీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న డా. హరికిషన్, సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్ : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆరోగ్య కేంద్రం అధికారులు, వైద్యులు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి : మరొకరికి తీవ్ర గాయాలు

- వాసుదేవ్‌పూర్ గేట్ సమీపంలో ఘటన

కడ్తాల్, మే 16 : పిడుగుపాటుకు ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం కడ్తాల్ మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గేట్ సమీపంలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. మాడ్గుల మండల పరిధిలోని కలకొండకు చెందిన పసునూరి ప్రవీణ్‌చారి (30) కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనిలో భాగంగా ప్రవీణ్‌చారి అతని మామ తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన జంగయ్యచారి ఇద్దరు కలిసి బైక్‌పై కడ్తాల్‌కు వచ్చారు. పనులు ముగించుకొని సాయంత్రం ఇరువురు బైక్‌పై స్వగ్రామాలకు వెళ్తుండగా.. వాసుదేవ్‌పూర్ గేట్ వద్దకు రాగానే ఉరుములు, మెరుపులతో కూడిన వాన మొదలైంది. దీంతో బైక్‌ను హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన నిలిపి వాసుదేవ్‌పూర్ గేట్ బస్సు షెల్టర్‌లోకి వెళ్తుండగా పిడుగు పడింది. దీంతో ప్రవీణ్‌చారి అక్కడికక్కడే మృతి చెందాడు. జంగయ్యచారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో బస్సు షెల్టర్ ఎదుట నిల్చున్న మాడ్గుల మండల కేంద్రానికి చెందిన గౌని నిరంజన్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సు షెల్టర్‌లో 10 మంది వరకు ఉన్నా ఎవరూ ప్రమాదానికి గురికాలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నిరంజన్‌ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రవీణ్‌చారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ప్రవీణ్‌చారికి గతేడాది తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగినట్లు సమాచారం.

నేదునూరులో చోరీ

- రూ 50వేల నగదు, బంగారం అపహరణ

కందుకూరు, మే 16 : మండలంలోని నేదునూరు గ్రామంలోని ఓ ఇంట్లో బంగారం, నగదును దుండగులు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. నేదునూరుకు చెందిన కొమ్ము జంగయ్య బుధవారం రాత్రి తన భార్యతో కలిసి భోజనం చేసి అనంతరం ఇంట్లో ఉక్కపోతగా ఉండటంతో ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రించారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారాను పగుల గొట్టి అందులోని వస్తువులను చిందర వందర చేసి తులం బంగారు మాటేలు, తులం బంగారు గొలుసు, అర తులం ఉంగరం, మొత్తం 2 1/2 తులాల బంగారంతోపాటు రూ. 50 వేల నగదును అపహరించి పరారయ్యారు. ఉదయం జంగయ్య భార్య నవనీత ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే జంగయ్య కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మక్బూల్ జానీ తెలిపారు.

30 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట, మే 16 : యోనెక్స్ సన్‌రైజ్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 30 నుంచి జూన్ 2 వరకు న్యూ నాగోల్ సౌభాగ్యనగర్‌లోని ఆర్3 బ్యాడ్మింటన్ ఎక్సలెన్సియా(గ్రీన్ అండ్ రెడ్)లో జరుగనున్నాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సబ్ జూనియర్ అండర్-13,అండర్-15 ఇయర్స్ విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, జూనియర్స్ అండర్-17, అండర్-19 ఇయర్స్ విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, మెన్ అండ్ ఉమెన్ విభాగంలో(35 నుంచి 80 ఏండ్ల వయసు గల వారు)సింగిల్స్, డబుల్స్, వెటరన్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో సింగిల్స్ అండ్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నామని శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 26 లోపుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్(https:// btronlin e.in/)చేయించుకోవాలని, స్పాట్ ఎంట్రీస్ ఉండవని తెలిపారు. వివరాలకు 7788993006, 9848015443 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బండ్లగూడ, మే 16 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గండిపేట మండల తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన అదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది గండిపేట మండల పరిధిలోని గంధంగూడ, హిమాయత్ సాగర్‌లో మూడు అక్రమ నిర్మాణాలు, నాలుగు నీటి సంపులను తొలగించారు.

అడ్డుగా ఉన్న వాహనం తీయమన్నందుకు దాడి

శంషాబాద్ రూరల్, మే 16 : తన వాహనానికి అడ్డుగా పెట్టిన ద్విచక్ర వాహనం తీయమంటే దాడిచేసి గాయపర్చారని ఓ వ్యక్తి శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని రుద్రకాలనీకి చెందిన సురేశ్ బుధవారం రాత్రి శంషాబాద్ పట్టణంలో ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద తన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. తిరిగి తన స్నేహితుడు సాయితో కలిసి వెళ్లి వాహనం తీసుకునే క్రమంలో అడ్డుగా ఉన్న వాహనాన్ని తీయాలని కోరాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ముగ్గురు వ్యక్తులు సురేశ్, సాయిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శంషాబాద్ పట్టణంలోని హైమ్మద్‌నగర్ కాలనీకి చెందిన తౌసిఫ్, ఉమ్మర్, మిర్జా హైమ్మద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.